ప్రజాశక్తి
ఆదివారం 30 జులై 2023
5
పార్వతీపురం మన్యం



మాజీ ఎమ్మెల్యే చిరంజీవులుకు అస్వస్థత

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు శనివారం తన ఇంట్లో అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన స్థానికులు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమయానికి కుటుంబ సభ్యులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావు స్పందించి ప్రైవేటు ఆసుపత్రి తరలించగా వెంటనే వైద్యులు ప్రథమ చికిత్సను అందించారు. ఛాతిలో నొప్పి రావడంతో ఆయన అస్వస్థతకు గురయ్యారని వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, కొన్ని పరీక్షలు అనంతరం మెరుగైన చికిత్స కొరకు విశాఖపట్నం తరలించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

ప్రారంభానికి సిద్ధంగా బైపాస్ రోడ్డు

- నాలుగు దశాబ్దాల చిరకాల స్వప్నం
- పట్టణ ప్రజలకు తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణానికి సంబంధించిన బైపాస్ రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తయింది. లాంఛన ప్రాయంగా ప్రారంభోత్సవం చేపట్టడమే తరువాయి. సుమారు రూ.36కోట్లతో రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఇప్పటికే అంతర్‌రాష్ట్ర వాహనాల రాకపోకలు సాగిపోతున్నాయి. ఒడిశా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలు ఇకపై పట్టణ నడిబొడ్డు మీదుగా వెళ్లాల్సిన అవసరం లేదు. దీంతో పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీరను న్నాయి. సుమారు నాలుగు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. పట్టణానికి సంబంధించినంత వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చాలా అవసరమని అనేక ఏళ్లుగా ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు కోరారు. పట్టణం నడిబొడ్డు మీదుగా జాతీయ రహదారి 26 వెళ్తుండడంతో ఒడిశా, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రాలకు చెందిన వాహనాల రాకపోకలు సాగిస్తుండేవి. భారీలోడులతో లారీలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండేవి. ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు కత్తి మీద సాములా వుండేది. కొన్ని సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతుండేవి. పట్టణం మీదుగా వెళ్లే రహదారి ఇరుగ్గా ఉండడంతో వాహనదారులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కాదు. వాయు కాలుష్యం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే పరిస్థితులు నెలకొన్నాయి. గత 20ఏళ్లు ఎమ్మెల్యేగా రాజన్నదొర ఉండడంతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి బీజం పడింది. ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బైపాస్ రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు మంజూరు చేయించారు. బైపాస్ నిర్మాణం చేస్తామని ప్రతి ఎన్నికల్లోనూ రాజకీయ పార్టీలు హామీ లు గుప్పించి గాలికొదిలేశాయి. 40సంవత్సరాలుగా ఎదురు చూసిన పట్టణ వాసుల చిరకాల స్వప్నం సాకారమైంది. అధికారికంగా ప్రారంభానికి సిద్ధంగా వుంది. అనధికారికంగా రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలు సాగిపోతున్నాయి.దీనిపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న బైపాస్ రోడ్డు

మహిళలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

దేశంలోని, రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై హింస విపరీతంగా పెరిగిపోతుందని, దీనిపై మహిళలకు ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి అన్నారు. శనివారం హింసపై మహిళా పోరుయాత్ర జాతా పాలకొండకు చేరింది. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలకు రక్షణ కరువవుతుందని, బిజెపి పాలనలో మహిళలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. హింసను రెచ్చగొడుతున్న బిజెపిని గద్దె దించాలన్నారు. మహిళలపై జరుగుతున్న నేరాలను అధ్యయనం చేయడానికి నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించే చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిందితులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా త్వరితగతిన విచారించి కఠిన శిక్షలు విధించాలన్నారు. కళాశాలల దగ్గర, మహిళలు పనిచేస్తున్న ప్రదేశాలల్లో వేధింపులు నిరోధించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలను నియంత్రించేలా చర్యలు చేపట్టాలన్నారు. మహిళలపై జరుగుతున్న సంఘటనలపై ప్రభుత్వాలు దృష్టిపెట్టి పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎన్.హిమప్రభ, శారద, గౌరీశ్వరి, శ్రీదేవి, జెస్సీబాయి తదితరులున్నారు. ఈ సందర్భంగా మహిళలపై జరుగుతున్న హింసాకాండపై నాటకాలు ద్వారా ప్రదర్శించి పలువురిని ఆకట్టుకున్నారు.

మహిళా పోరుయాత్ర జాతాలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి



పార్వతీపురం : జాతాలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి

పార్వతీపురంరూరల్ : ఐద్వా ఆధ్వర్యాన జరుగుతున్న మహిళా పోరుయాత్ర జాతా శనివారం సాయంత్రం చేరుకుంది. ఈ జాతాకు పట్టణ ఐద్వా నాయకులు బొగ్గులవీధి జంక్షన్ వద్ద స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు, లైంగిక వేధింపులకు నిరసనగా ఈ జాతాను చేపట్టామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ ఆగస్టు 9న విజయవాడలో జరుగు బహిరంగ సభకు పెద్దఎత్తు మహిళలు విచ్చేసి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమణి, అభ్యుదయ కవి పక్కి ఉమాశంకర్, యుటిఎఫ్ ఎస్ఎఫ్ఐ, పట్టణ పౌరసంక్షేమ సంఘం, సిఐటియు, ఆర్‌పిల సంఘం పట్టణ సంఘ నాయకులు గెద్ద తులసి, బెలగాం రమణమ్మ, మంగమ్మ, గౌరమ్మ పాల్గొన్నారు.



పాలకొండ : మహిళలపై జరుగుతున్న హింసపై నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

9న చంద్రబాబు తోటపల్లి ప్రాజెక్టు సందర్శన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

జిల్లాలోని తోటపల్లి సాగునీరు ప్రాజెక్టును టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆగస్టు 9న సందర్శించడానికి విచ్చేయచున్నారని మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ తెలిపారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ తోటపల్లి బ్యారేజి సందర్శన అనంతరం అక్కడ నుంచి పార్వతీపురం వరకు రోడ్ షో ఉంటుందని తెలిపారు. ఆరోజు రాత్రి పార్వతీపురంలో రాత్రిబస, మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. మరుసటి రోజు 10వ తేదీన పార్వతీపురం నుండి బయలుదేరి శ్రీకాకుళం వెళ్తారని తెలిపారు.

సోమవారం కొత్తనియోజకవర్గ ఇన్‌ఛార్జి రాక

పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పార్టీ అధిష్టానం కొత్తగా నియమించిన బోనెల విజయ్ చంద్ర సోమవారం పార్వతీపురం విచ్చేసి బాధ్యతలు చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు సమాచారం అందచేసినట్లు జగదీష్ తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు పార్వతీపురం మండలంలోని నరిసిపురం చేరుకొని, అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుండి పాదయాత్రగా పార్వతీపురం పార్టీ కార్యాలయానికి వస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని మూడు మండలాల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొనాలని పార్టీ సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం పట్టణ, మండలం అధ్యక్షులు జిరవికుమార్, దొగ్గ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటనకు నిరసనగా

కొవ్వొత్తులతో ప్రదర్శన

ప్రజాశక్తి - కలెక్టరేట్

మణిపూర్‌లో జరుగుతున్న మారణ హెూమానికి, మహిళలను వివస్త్రలను చేసి, అత్యాచారం చేసి హత్య చేసినందుకుగా పార్వతీపురం పట్టణంలో వివేకానంద కాలనీలో సిపిఎం ఆధ్వర్యాన శనివారం కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అడవి, అటవీ ఉత్పత్తులుపైనా, గనులు, ఖనిజ సంపదపై ఆధిపత్యాన్ని సాధించడానికి మైనింగ్ మాఫియాతో చేతులు కలిపి అభివృద్ధి చెందిన మోతీ తెగకు ఎస్.టి రిజర్వేషన్ కల్పించిందని అన్నారు. ఇది అన్యాయమని అంటున్న కుకీ గిరిజనుల పై దాడి, దౌర్జన్యం చేసి ఆస్తులు, ప్రాణ నష్టం కల్పిస్తుందన్నారు. అలాగే మహిళలపైన ,దాడులు చేసి, హింసను సృష్టించి, అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించడం సభ్య సమాజానికి సిగ్గుచేటని, ఈ సంఘటనను ప్రజలంతా ఖండించాలని డిమాండ్ చేశారు. ఈ దారుణాన్ని చూపి ప్రపంచమే విస్తుపోయిందన్నారు. ఈ ఆరాచకమంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కనుసన్నల్లోనే జరుగుతుందన్నారు. ఇంతటి దారుణానికి కారకుడైన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని వెంటనే గద్దెదించాలని, హింసను సృష్టించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బలహీన తెగకు చెందిన అడవి జాతి కుకీలపై మెజారిటీగా ఉండి అభివృద్ధి చెందుతున్న మూతి తెగలోని ఆర్ఎస్ఎస్ గుండాలు దాడిని ఖండించాలని పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు బంకురు సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు వి.ఇందిర, ఐద్వా జిల్లా నాయకులు గౌరీశ్వరి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి నర్సింగరావు

ఐక్య పోరాటాలకు సిద్ధం చేయాలి

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కార్మికవర్గాన్ని ఐక్య పోరాటాలకు సిద్ధం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగ రావు, కార్యదర్శి కె.సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు శనివారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల సిఐటియు కార్యకర్తల వర్క్‌షాప్ కెఎల్‌పురంలోని ఎన్‌పిఆర్ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ వికృత విధానాలకు కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతున్నదని, అందువలన కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే బాధ్యత సిఐటియుపై ఉందని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుండి కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు దాసోహం అవుతుందని, అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ బలహీనపరుస్తున్నారని అన్నారు. రోజురోజుకు నిత్యవసర సరుకులు ధరలు పెరిగి కార్మికులు పొందుతున్న నిజ వేతనం తగ్గిపోతున్నదనీ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని తెలిపారు.. అసంఘటితరంగ కార్మికుల సంక్షేమ చట్టాలను రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం చేసే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈ సమస్యలన్నింటిపై సిఐటియు నాయకత్వంలో దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి విస్తృత పోరాటాలకు సిద్ధం చేస్తామని అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి బివి రమణ, విజయనగరం జిల్లాకార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రెండు జిల్లాల సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, దావాల రమణారావు, వై.మన్మధరావు, టివి రమణ, వి.లక్ష్మి, ఎన్ వై నాయుడు, బి సుధారాణి, బి.రమణ, బి.సూర్యనారాయణ, జిఅప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహరాం

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా వ్యాప్తంగా ముస్లిములు శనివారం మొహరాం నిర్వహించుకున్నారు. ఆనాటి దుష్ట యూదు రాజుల అన్యాయాన్ని, అధర్మాన్ని వ్యతిరేకిస్తూ న్యాయ పరిరక్షణ, ధర్మ పరిరక్షణకు ఇస్లాం మతంలో దైవ ప్రవక్త మొహమ్మద్ మనువడు హజరత్ ఇమామ్ హుస్సేన్, యూదులు సైన్యంతో పోరాటం చేసి యుద్ధ భూమిలో మరణించారని ముస్లిం పెద్దలు తెలిపారు. ప్రజలంతా సౌభాగ్యంతో ఉండాలని కోరారు.



వైసిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బొత్స, పక్కన రాజన్నదొర, పరీక్షిత్‌రాజు

వైసిపి కార్యాలయాన్ని ప్రారంభించిన బొత్స

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వైసిపి జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. పట్టణంలోని బైపాస్‌రోడ్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన తాత్కాలిక భవనంలో పార్టీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా బొత్సతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర, ఎమ్మెల్సీ సభ్యులు పాలవలస విక్రాంత్, కురుపాం, పాలకొండ, పార్వతీపురం, ఎమ్మెల్యేలు పి.పుష్ప శ్రీవాణి, వి.కళావతి, అలజంగి జోగారావు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ల చైర్మన్లు, జిల్లా పరిధిలో గల ప్రజా ప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు సమక్షంలో పార్టీ కార్యాలయాన్ని ఘనంగా ప్రారంభించి పరీక్షిత్ రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బొత్సకు దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైసిపి ప్రజా ప్రతినిధులు, కన్వీనర్లు, వైసిపి పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గాల్లో విజయం సాధించాలి

అనంతరం విలేకరులతో మంత్రి బొత్స సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు వర్గాల్లో వైసిపి అభ్యర్థులు విజయం సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఇదే మనం ముఖ్యమంత్రికి ఇచ్చే బహుమతని, ఆ దిశగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని కోరారు.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

- కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జగదీశ్వరి
- సాగునీటి కాలువలను పరిశీలించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

వైసిపి ప్రభుత్వానికి రైతుల సమస్యలు పట్టడంలేదని, రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చాక సమస్యలన్నీ పరిష్కరిస్తామని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని తోటపల్లి పాత కుడి, ఎడమకాలువల ఆధునీకరణ పనులు, జంఝావతి కాలువ పనులను పర్యవేక్షించి సెల్ఫీ ఛాలెంజ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019లో తోటపల్లి పాత కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనులు ప్రారంభించి సుమారు 30 శాతం పనులను టిడిపి చేయగా, మిగిలిన పనులను ఈ ప్రభుత్వం ఎందుకుపూర్తి చేయలేదని ప్రశ్నించారు. పనులు పూర్తి చేసి ఉంటే రైతులు రెండు పంటలు పండించి అభివృద్ధి చెందే వారన్నారు. ఆధునికీకరణ పనులు పేరు తో నాలుగేళ్లుగా రెండో పంటకు నీరు ఇవ్వకుండా రైతులను వైసిపి ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. అలాగే జంఝావతి పనులు పూర్తిచేసి చివరి ఆయకట్టు వరకు నీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తోటపల్లి అదనపు ఆయకట్టుకు సంబంధించి 2019 ఫిబ్రవరిలో తోటపల్లి, నాగూరు, చింతల బెలగాం లిఫ్టు ఇరిగేషన్ స్కీములకు, టిడిపి హయంలో తెచ్చిన జిఒ164ను వెంటనే అమలు చేసి పనులు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గజాలఖానా కూలి ఐదేళ్లయినా ఇంత వరకు మరమ్మతులు చేయలేదని విమర్శించారు. తక్షణమే నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, అరకు పార్లమెంట్ రైతు అధ్యక్షుడు దేవకోటి వెంకటనాయుడు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శిమరడాన తవిటి నాయుడు, జిల్లా కార్యదర్శి ఎం బి.వివిజయాంకుశం,పెద్దింటి పూర్ణచంద్రావు, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు అంబటి తవిటి నాయుడు(రాంబాబు), జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు కోటభరత్ కుమార్), నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షులు ఆర్నిపల్లి గంగాధర నాయుడు, పాలూరు శ్రీనివాసరావు, గొట్టాపు త్రినాథ్,తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం

పాలకొండ : ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 2019లో తోటపల్లి పాత కుడి, ఎడమ కాలువల ఆధునీకరణ పనులు ప్రారంభించి 30శాతం పనుల వరకు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేసినా మిగిలిన పనులు ఈ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. నాలుగేళ్లలో ఒక్కశాతం కూడా పని జరగలేదన్నారు. గత నాలుగేళ్లుగా రైతులకు నీరివ్వకుండా మోసం చేస్తున్నారన్నారు. ఉత్తరాంధ్రాలో ఎక్కడా ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాకుండా కాలయాపన చేస్తూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. విలేకరుల సమావేశంలో టిడిపి కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, ఏరియా ఆస్పత్రి మాజీ చైర్మన్ వెన్నపు శ్రీనివాసరావు, కిమిడి కాశీంనాయుడు, జాడ శ్రీధర్ తదితరులున్నారు.



ప్రాజెక్టు సందర్శనలో పాల్గొన్న టిడిపి నాయకులు జగదీశ్వరి

పరిశ్రమలు ఎక్కడ ? భూములు ఎవరికి ?



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఎద్దు ఈనిందంటే ఇల్లవతల కట్టేయమన్నాడట వెనుకటి ఓ వ్యక్తి. కానీ, మన జిల్లా ప్రజానీకం అటువంటి మొద్దులు కాదు సుమా..! కాస్తాంత సౌమ్యంగా, సున్నితంగా వ్యవహరిస్తున్నా ఆలోచనలో మరీ అంత వెనుకబడిపోలేదు. నిన్నగాక మొన్న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన జరిగిన పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి సమావేశంపై ప్రజలు స్పందిస్తున్న తీరే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఆ సమావేశంలో అధికారుల నిర్ణయాలు, ఉన్నతాధికారి ఆదేశాలు కోటలు దాటుతున్నా ఆచరణలో కనిపించకపోవడంతో ఒకిన్ని అనుమానాలు, ఆశ్చర్యాలు వ్యక్తమౌతున్నాయి. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు భూ కేటాయింపు చేయడంలో జాప్యం జరగడానికి వీల్లేదని కలెక్టర్ ఆదేశించారు. కానీ, ఆ పరిశ్రమలు ఎక్కడ? ఎవరు? ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు? ముడిసరుకు మేమిటి? ఉత్పత్తులు ఏమిటి? మార్కెటింగ్ పరిస్థితి ఎలా ఉంటుంది? ఎగుమతులు, దిగుమతులు ఉంటాయా? వాటి వల్ల జిల్లాకు ఒనగూరేదెంత ఉంటుంది? ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి కల్పన ఏమేరకు ఉంటుంది? అన్నది జిల్లాలో చాలా మంది చర్చిస్తున్న అంశం. ఇందుకు కారణం లేకపోలేదు. జిల్లా పారిశ్రామిక రంగంలో అత్యంత వెనుకబడి ఉంది. జిల్లా వార్షిక ఆదాయం రూ.35,385 కోట్లు కాగా, పరిశ్రమల ద్వారా వస్తున్న ఆదాయం కేవలం రూ.4,520కోట్లు (13.91శాతం) మాత్రమే. ఇంకా లోతుగా పరిశీలిస్తే గడిచిన ఐదేళ్లగా ఈ ఆదాయం తగ్గుతూ వస్తోంది. దీనికితోడు ఇటీవల జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్, చెక్కెర కర్మాగారాలు మూతపడ్డాయి. దీంతో, గడిచిన పదేళ్లలో సుమారు 30వేల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారు. జిల్లా నుంచి వలసలు కూడా ఎక్కువేనన్నది వేరేగా చెప్పనక్కర్లేదు. విటి అగ్రహారం, సారిపల్లి, కంటకాపల్లి, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో కొన్ని దశాబ్దాల క్రితమే కేటాయించిన భూములు ఖాళీగానే ఉన్నాయి. ఆయా చోట్ల ఏర్పాటు చేసిన చాలా పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లాకు పరిశ్రమ వస్తుందంటే లక్షల కుటుంబాలు ఆసక్తిగా ఎదురు చూస్తాయి. చూస్తున్నాయి కూడా. ఈ నేపథ్యంలో జిల్లాకు రాబోతున్న పరిశ్రమలు, ఉత్పత్తి, ఉత్పాదకత, వనరులు, ఇతర అవకాశాల గురించి ప్రస్తావన లేకుండా కేవలం భూముల కేటాయింపుపైనా, భద్రతా ప్రమాణాలపైనా చర్చించడం హాస్యాస్పదంగా ఉంది.

జిల్లాకు రాబోతున్న యూనిట్లు, వాటి యజమానులు, వారికి కేటాయిస్తున్న భూముల గురించి కనీసం మీడియాకు విడుదల చేసిన ప్రకటనల్లో కూడా ఆయా అంశాలు లేకపోవడం గమనార్హం. దీన్నిబట్టి పరిశ్రమలన్నీ ఉత్తుత్తివేనని, కాగితాల్లో లెక్కలు మాత్రమేనని, భూములు ఎవరికో కట్టబెట్టడానికే ఇటువంటి సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని జనం బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.



జాబ్‌మేళాకు ఎంపికై నియామక పత్రాలు అందుకున్న విద్యార్థులు

మెగా జాబ్‌మేళాకు స్పందన


ప్రజాశక్తి - బెలగాం

స్థానిక స్థానిక భాస్కర్ కళాశాలలో జరిగిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. ఈ మేళాకు 410 మంది విద్యార్థులు హాజరుగా 280మంది అర్హత సాధించినట్టు కాలేజీ డైరెక్టర్ బొంతు శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో 50 మంది విద్యార్థులకు ఉద్యోగ నియామక ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. మిగిలిన 230 మంది విద్యార్థులకు వారం రోజుల్లో ధ్రువీకరణ పత్రాలను పంపుతామని తెలిపారు. ఈ జాబ్ మేళాలో తమ కాలేజీకి చెందిన 30 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు. ఈ జాబ్ మేళాలో గంగాధర్‌రావు, మారుతీకుమార్, కళాశాల ప్రిన్సిపల్ ఎంఆర్ఎస్ శాస్త్రి పాల్గొన్నారు.

ఎంపిటిసి కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండలం లోని జి. శివడ ఎంపిటిసి మీనక అయోధ్య అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందిన సంఘటన తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శనివారం ఆయన స్వగ్రామమైన మడ్డు గూడలో ఆయన ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆమె మాట్లాడుతూ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యాన్ని భరోసా ఇచ్చి ఏ సమయంలో ఏ అవసరమైన తనకు సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి పద్మావతి, స్థానిక సర్పంచ్ బి.మిన్నారావు వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షులు అంధవరపు కోటేశ్వరరావు, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైసీపీ నాయకులు గురుబిల్లి రాజారావు, ఐ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అయోధ్య చిత్ర పటానికి పూలువేసి నివాళ్లు అర్పిస్తున్నఎమ్మెల్యే

టిటిడిలో అన్నదానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని తూరాయిపువలస సమీపాన గల తిరుమల తిరుపతి దేవాలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు గెంబలి లక్ష్మణరావు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇంకా ఎవరైనా అన్నదాన నిర్వహించడానికి దాతలు ముందుకు రావచ్చు అని నిర్వాహకులు తెలిపారు.



మలేరియా పిచికారీని పరిశీలిస్తున్న వైద్యాధికారి ప్రజ్ఞ

మలేరియా నివారణకు స్ప్రేయింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ వారి ఇంటికి తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయించుకోవాలని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని బి. ప్రజ్ఞ అన్నారు. మండలంలోని లంకజోడులో జరుగుతున్న మలేరియా స్ప్రేయింగ్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ప్రజలెవరికీ మలేరియా సోకకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఎఎల్ఒ కార్యక్రమం, ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ చేయించడం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ స్ప్రేయింగ్ చేయించుకోవాలన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని దోమతెరలు వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు, ఆరోగ్య సహాయకులు జె.తిరుపతిరావు, కేశవ, గీత, తదితరులు పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్లతో పెచ్చులూడుతున్న బిటి రోడ్లు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని ఎం.రాజపురం, కత్తుల కవిటి, హుస్సేన్ పురం, తెట్టంగి, కంబర వలస, తలవరం తదితర గ్రామాల బిటి రహదారులు దమ్ము ట్రాక్టర్ల రాకపోకలతో పెచ్చులూడి దర్శనమిస్తున్నాయి. రహదారులు ఎక్కడికక్కడే పెచ్చులూడిపోవడం వల్ల వీటిపై వాహనదారులు రాకపోకలు సాగించడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నట్టు వాహనదారులు ఆరోపిస్తున్నారు. లక్షలాది రూపాయలతో నిర్మించిన రహదారులు కాలం చల్లక ముందే దమ్ము ట్రాక్టర్ల ద్వారా శిథిలమైపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దమ్ము ట్రాక్టర్ల యజమానులపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

పార్వతీపురం నుంచి పాలకొండ వెళ్లే రహదారి తోటపల్లి కుడి ప్రధాన కాలువ దగ్గర ఉల్లిభద్ర సమీపంలో పెద్దపెద్ద గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా నిరంతరం అనేక వాహనాలు తిరుగుతూ రోజుకు ఒకరిద్దరైనా గుంతల్లో పడడం తప్పడం లేదు. ఈ ప్రాంతాన్ని చేరుకున్నటు వంటి వాహన చోదకులు గుండె అరచేతిలో పెట్టుకుని వాహనాలు నడపవలసిందే. ఆర్అండ్‌బి శాఖ వారు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడం తప్ప శాశ్వత పరిష్కారమయ్యేలా ప్రయత్నించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ బ్రిడ్జి రోడ్డు కంటే దిగువ భాగంలో ఉండడం వల్ల ఈ రోడ్డును దాని సమతలమైన విధంగా నిర్మాణం చేపట్టడం వల్ల రోడ్డు గుంతలమైమవుతుందని వాహనదారులు అనుకుంటున్నారు.

శాశ్వత పరిష్కారం కావాలి

రానున్న వర్షాకాలంలో ఈ గుంతలు మరింత ప్రమాదకరంగా మారుతాయి. వర్షాలు అధికమైనట్లయితే ఈ రోడ్డు మరమ్మతులు చేయడం కష్టతరంగా మారుతుందని, దీనికి సంబంధించిన ఇరిగేషన్, ఆర్ అండ్ బి సంయుక్తంగా తాత్కాలిక మరమ్మతులు చేయడంతో పాటు శాశ్వతమైన పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే అనేకమంది వాహనదారులు ఈ గుంతల్లో అదుపుతప్పి పడిపోతున్నారు.



ఉల్లిభద్ర వద్ద గతుకులమయమైన పార్వతీపురం- పాలకొండ వెళ్లే రోడ్డు

పేదలకు అండగా ఉంటాం : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో మహాశక్తి కార్యక్రమాన్ని తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టారని కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని కుక్కిడి పంచాయతీ కుక్కిడి శివడ, నిగరం, పెద్దగూడ గ్రామాల్లో మహాశక్తి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, 18ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500, ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు చొప్పున అందివ్వాలని, డిగ్రీ చదువుకున్న ప్రతి నిరుద్యోగికి నెలకు రూ. 3,000 ఆర్థిక సాయం, ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మంది పిల్లలకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని, ప్రతి మహిళకు జిల్లాలో ఆర్టీసీ ప్రయాణం ఉచితమని, ప్రతి నిరుపేద కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చంద్రబాబు నాయుడు ఇచ్చిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ కార్యదర్శి అడ్డాకుల నరేష్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ వెంకట్రావు, యూనిట్ ఇన్‌ఛార్జ్ నల్లా రవికుమార్, బూత్ ఇన్‌ఛార్జ్ రాము, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : టిడిపి మేనిఫేస్టోను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు జగదీశ్వరి, కార్యకర్తలు

సాలూరు : రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి చెప్పారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న మహాశక్తి చైతన్య రథం ర్యాలీలో భాగంగా పట్టణంలో ర్యాలీ చేపట్టారు. ఇన్‌ఛార్జి సంధ్యారాణితో పాటు మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రకటించిన మేనిఫెస్టోతో ప్రతి పేదకుటుంబానికి ఏటా రూ.లక్షా 22వేల ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పట్టణ నాయకులు గొర్లి మధుసూదనరావు, కౌన్సిలర్లు బందాపు సత్యవతి, కె.వరలక్ష్మి, మాజీ కౌన్సిలర్ డి.కష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి వెంకటరమణ నాయుడు

పారదర్శంగా తనిఖీలు : ఎంపిపి

ప్రజాశక్తి - వీరఘట్టం

ఉపాధి హామీ పనులకు సంబంధించి మండలంలో నిర్వహించిన పనులపై తనిఖీలు పారదర్శకంగా చేపట్టాలని ఎంపిపి డి.వెంకటరమణనాయుడు డిఆర్‌పిలను ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలోఆయన మాట్లాడుతూ తప్పులకు తావీయకుండా నిజాయితీగా సర్వే చేపట్టాలని సూచించారు. 2022 ఏప్రిల్ ఒకటి నుండి 2023 మార్చి 31 వరకు మండలంలోని ఉపాధి హామీ చట్టం ద్వారా ఐటిడిఏ ,ఆర్డబ్ల్యూఎస్, పిఆర్, ఉపాధి హామీ పనులకు సంబంధించి 816 రకాల పనులు చేయడం జరిగిందని, వీటికి రూ.17 కోట్ల 11,49,158 లు చెల్లించామని తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి జంపు కన్నతల్లి- ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపిపి విజయకుమారి, ఎపిఒ జి.సత్యం నాయుడు, ఎస్ఆర్పిలు ఎం గోవిందరావు, తిరుపతిరావు, డీఆర్పీలు, టిఎలు పాల్గొన్నారు .

జగనన్న సురక్షతో ప్రజల చెంతకు ప్రభుత్వం

ప్రజాక్తి-పాలకొండ రూరల్

జగనన్న సురక్ష కార్యక్రమంతో మరోసారి ప్రజల చెంతకే ప్రభుత్వం చేరిందని ఎంఎల్‌సి పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలో భాసూరులో జగనన్న సురక్ష కార్యక్రమం శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే సేవలు తీసుకువెళ్లాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనివల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇళ్ల వద్దకే సర్టిఫికెట్లు జారీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రభాకరరావు, ఎంపిడిఒ ఉమామహేశ్వరి, డిప్యూటీ తహశీల్దార్ బుచ్చియ్య, సర్పంచ్ శిర్లాపు మల్లేశ్వరమ్మ, అల్లెన పకీరునాయుడు, పాలవలస ధవళేశ్వరరావు, గురివినాయుడు తదితరులున్నారు.

పార్వతీపురం రూరల్ :మండలంలోని ఎమ్మార్ నగరం, డిములగ సచివాలయాలలో జరిగిన సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొని దరఖాసుదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. తొలుత లక్ష్మీనారాయణపురం చేరుకుని ఆ సచివాలయం వద్ద జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన 11 రకాల అత్యవసరమైన దవీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిష్కారం కాకుండా ఇంకా ఏమైనా సమస్యలు మిగిలి ఉన్నాయంటే అక్కడికి విచ్చేసిన ప్రజలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులు వంగపండు లక్ష్మి, మడక కష్ణవేణి, మండల పార్టీ అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాధరావు, బంకురు రవి కుమార్, మజ్జి శేఖర్, స్థానిక సర్పంచులు, తహశీల్దార్ శివన్నారాయణ, ఎంపిడిఓ ఎస్ రమేష్, ఆత్మ చైర్మన్ ఎంద్రాపు తిరుపతిరావు, వైసిపి సీనియర్ నాయకులు వంగపండు త్రినాధ, విశ్వనాథం,బలగ నాగేశ్వరరావు, వేంపలి గురురాజు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, గహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని తామరకండి, సూరంపేట గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి ఎం.బాబ్జి దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వచ్చే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్‌వి రమణ, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఎపిఎం ఆర్.శ్రీరాములు, హౌసింగ్ ఎఇ జానకీరామ్, వైసీపీ నాయకులు బి.చిట్టి రాజు ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని విక్రంపురంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో దరఖాస్తు చేసుకున్న 53 మంది ప్రజలకు రైస్ కార్డులు పంపిణీ చేశారు. మరో బృందం ఎంపిడిఒ మల్లికార్జున ఆధ్వర్యంలో కంబవలసలో జగనన్న సురక్ష కార్యక్రమం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు గ్రామంలో ఇప్పటికే సర్వే చేసిన నివేదికల ప్రకారం ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేశారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో సందర్శించి ప్రజల సమస్యలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణ అధికారి రాధాకష్ణ, వివిధ మండల స్థాయి అధికారులు, నాయకులు కె మల్లిబాబు వైస్ ఎంపీపీ శరత్ బాబు, వైసీపీ కన్వీనర్ జనార్దన్ నాయుడు, సర్పంచి ఉప సర్పంచ్లు ప్రజలు నాయకులు వాలంటీర్లు సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం : సభలో మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సభ్యులు బాబ్జీ

నీరిలా ఉంటే తాగేదెలా?

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలోని 25,26వ వార్డుల్లో సోమవారం కుళాయిల ద్వారా తాగునీరు బురద రంగులో సరఫరా జరిగింది. 30 వార్డుల్లో కుళాయిల ద్వారా బురద నీరు సరఫరా ఇలా జరుగుతుంటే ఆ నీటిని ఎలా తాగమంటారని మున్సిపల్ అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రతి ఏటా వర్షాకాలంలో పట్టణ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ఇటు మున్సిపల్ అధికారులు గానీ, అటు ప్రజాప్రతినిధులు గానీ చర్యలు చేపట్టకపోవడం దారుణమని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభంలోనే తాగునీరు ఈ రంగులో ఉంటే అత్యధిక వర్షాలు పడితే ఇంకా బురదమయంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు శుద్ధ జలాలను సరఫరా చేసి పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.



కుళాయిల ద్వారా బురదతో వస్తున్న తాగునీరు

రైతులు శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

సాంప్రదాయ వరి సాగు పద్ధతులను శాస్త్రీయ పద్ధతులతో మిలితం చేసి రైతులు వరి సాగు చేపట్టడం ద్వారా దిగుబడులు పెంచుకొని ఖర్చును తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాంచాలిలో రైతు బుడుమూరి వెంకన్నకు గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకంలో భాగంగా ఇచ్చిన ఎంటియు 1064 రకాన్ని వరుసల్లో నాట్లు వేయించారు. ముందుగా ప్రధాన పొలంలో వేసిన కట్టె జనుము, జీలుగు, పచ్చిరొట్ట విత్తనాలను కలియదున్ని కొద్దిగా సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లుకుంటే పచ్చిరొట్ట త్వరగా కుళ్లి భూమిలో సేంద్రీయ పదార్థం పెంచుతుందని తెలిపారు. అనంతరం నారును శుద్ధి చేసుకుని ఆపై కొసలు తుంచి వరుసల్లో నాటుకోవాలని తెలిపారు. నారుశుద్ధి వల్ల ప్రధాన పొలంలో నెలరోజుల వరకు తెగుళ్ల ఆశించకుండా ఉంటాయని, కొసలు తుంచి నాటుకోవడం వల్ల కాండం తొలుచు పురుగును గుడ్డు దశ నుండే నివారించుకోవచ్చని తెలిపారు. వరుసల్లో నాట్లు వేయడం ద్వారా గాలి, వెలుతురు అన్ని వైపులా ధారాళంగా ప్రవహించడం వల్ల దోమపోటు ఉధృతి తక్కువగా ఉండడమే కాకుండా చీడపీడలను సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. అంతర్ కృషి ఎరువులు వేసుకోవడం వంటివి సులభంగా చేయవచ్చని తెలిపారు. అలాగే వరి నాట్లు వేసేటప్పుడు బురద పదునులో ఒకటి లేదా రెండు మొనలను మాత్రమే వేస్తూ బురద దమ్ములో తేలికపాటి నాట్లు వేసుకోవాలని నాట్లు లోతుగా వేస్తే మొన తిరగడం ఆలస్యం అవ్వడమే కాకుండా పిలకలు పెట్టే సమయం కూడా ఆలస్యమవుతుందని తద్వారా పిలకల సంఖ్య తగ్గిపోతుంది తెలిపారు. నాట్లు వేసిన మూడు రోజుల తర్వాత నీళ్ల పెట్టుకోవాలని, దమ్ములో ఎకరానికి బస్తా డిఎపి, 15 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు గట్లను శుభ్రం చేసుకోవడం ద్వారా గట్లపై ఉండే పాము పొడ తెగులు పంటను ఆశించకుండా ఉంటుందని, అలాగే ఎకరానికి 10 పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా పక్షుల ద్వారా పురుగులను నియంత్రించ వచ్చని తెలిపారు. దీనివల్ల ఆకు చుట్టు పురుగును సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో విఎఎ ఈదివిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వరినాట్లు వేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న ఎఒ తిరుపతిరావు

సీడ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం :

మండలంలోని గొరడలో శనివారం మా తోట జీవ ప్రాజెక్ట్ పరిధిలోని గొరడ ,రాయగడ జమ్మూ, పెంగవ, వల్లాడ గ్రామాలకు చెందిన 40 మందిరైతులు దేశి విత్తనాలు ప్రదర్శన మరియు విత్తన మార్పిడిపై (సీడ్ మేళా) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మా తోట జీవ ప్రాజెక్ట్ అధ్యక్షులు జమ్మయ్య మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద రైతులు తమ యొక్క మొత్తం విస్తీర్ణంలో ఏడాది పొడవునా పంటలు పండించుకోవాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాధ్యపడుతుందన్నారు. పండ్ల తోటల్లో అంతర్ పంటలుగా పసుపు, అల్లం, పైనాపిల్, ఆకుకూరలు, కాయగూరలు, గడ్డి విత్తనాలు వేసుకోవడం వల్ల అదనపు ఆదాయం లభించడం జరుగుతుందని తెలిపారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు లభించడంతో పాటు, వాటిని ఉపయోగించుకోవడం వల్ల పౌష్టికాహారం లభిస్తుందని, నాబార్డ్ ఆర్థిక సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం ఈ ప్రాంతంలో నిర్వహించడం నిజంగా అభినందించ దగ్గ విషయమని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీరంతా మిగతా మాతోట రైతులకు ఒక ఆదర్శవంతంగా నిలవాలన్నారు. రైతులు పండించిన దేశీ విత్తనాలను ప్రదర్శించడం, విత్తన మార్పిడి చేసుకోవడం జరిగినది. ఇలా చేసుకోవడం వల్ల దళారుల బెడద లేకుండా మన విత్తనం మంచి విత్తనం వల్ల మొలక శాతం పెరుగుదలతో పాటు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని అన్నారు. అనంతరం రైతులకు కొర్రలు, సామలు విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాతోట జీవ కార్యదర్శి కె. చిరంజీవులు, సభ్యులు పెకాపు మురళి, కోఆర్డినేటర్లు జి.ప్రబోద్, జి.మురళీమోహన్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలను అందజేస్తున్న జమ్మయ్య

మౌలిక సదుపాయాలు కరువు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పార్వతీపురం మున్సిపాలిటీకి వెంకంపేట గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లో మౌలిక సౌకర్యాలు శూన్యమని జనసేన నాయకులు అన్నారు. శనివారం ఆ పార్టీ జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, అన్నాబత్తుల దుర్గాప్రసాద్ లు జగనన్న లే అవుట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న కాలనీ లే అవుట్లను పరిస్థితి చూస్తే ఫెయిల్యూర్ ఆఫ్ జగనన్న కాలనీగా తమకు తోచిందన్నారు. సాధారణంగా లేఅవుట్ ఏర్పాటు చేసేటప్పుడు ముందుగా రోడ్లు, డ్రైనేజీలు, నీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశాకే, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతు ందన్నారు. కానీ సంబంధిత అధికారులు, పాలకులు లేఅవుట్ కు అవేవీ కల్పించలేదన్నారు. వెంకంపేట, మరికి, నర్సిపురం సమీపంలో జగనన్న లేఅవుట్ల కోసం కొనుగోలు చేసిన భూములు విషయంలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలున్నాయన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు వీటిపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

ఆ వాహనంలో ఏముంది?

- వేరుశెనగ కాయలు మాటున గంజాయి తరలింపు?
- పోలీసుల అదుపులో వాహనం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పోలీసులకు శుక్రవారం అర్ధరాత్రి మెంటాడ అల్లూరి సీతారామరాజు జిల్లాల సరిహద్దు ప్రాంతం గరుగుబిల్లి వద్ద ఓ వాహనాన్ని పట్టుబడినట్లు తెలిసింది. ఆ వాహనంలో ఏముందనేది అంతుచిక్కడం లేదు. ఒక వాహనంలో గంజాయిని తరలిస్తున్నారని గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చిన సమాచారం మేరకు ఆంధ్ర పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లినట్లు సమాచారం. అక్కడ వున్న వాహనాన్ని అదుపులోకి తీసుకొని ఆంధ్ర పోలీసు స్టేషన్‌కు అక్కడ నుంచి గజపతినగరం సర్కిల్ కార్యాలయానికి తరలించారు.

వాహనంలో ఏముంది?

పోలీసులకు పట్టుబడిన వాహనంలో వేరుశెనగక్కాయలు మాటున గంజాయి వున్నట్లు మండలంలో ప్రచారం జరుగుతుంది. అరకు లేదా ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా గరుగుబిల్లి వద్దకు తీసుకొని వచ్చి ఇక్కడ లోడ్ చేసి విశాఖకు తరలించేందుకు సన్నాహాలు చేసినట్లు సమాచారం. పోలీసులకు అనుమానం రాకుండా చెనక్కాయలు మాటున గంజాయిని తరలించాలనుకున్నారు. బరువు ఎక్కువ కావడంతో చంపావతి నది ప్రాంతం వద్ద వాహనం మొరాయించింది. దీంతో స్థానికులకు అనుమానం కలిగింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అప్రమత్తమై వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. అయితే వాహనంలో ఏముందో పోలీసులు స్పష్టత ఇవ్వడం లేదు. డ్రైవర్ పోలీసులు అధుపులోవున్నాడా? పరారయ్యాడా తెలియవలసి వుంది? వాహనంలో ఏమీ లేకపోతే డ్రైవర్ ఎందుకు పారిపోయాడు. పారిపోకపోతే డ్రైవర్ ఎక్కడ అన్న సందేహం నెలకొంది. ఒకవేళ అందులో గంజాయి ఉంటే పోలీసులు ఎందుకు స్పష్టత ఇవ్వలేదన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి.

రెండేళ్లు క్రితం వెలుగులోకి

నవంబర్ 2021లో మొట్టమొదటి సారి అరకు నుంచి మెంటాడ మీదుగా గంజాయి రవాణా జరుగుతుండగా అప్పటి ఎస్ఐ సుదర్శన్ రెండు వాహనాలను పట్టుకున్నారు. వరుసగా 20 రోజుల్లో నాలుగు సార్లు అక్రమ గంజాయి రవాణాను అడ్డుకొని సుమారు వెయ్యి కేజీలు పట్టుకున్నారు. పిట్టాడ వద్ద చెక్ పోస్ట్ పెట్టి నివారించారు. ఈ మధ్యకాలంలో రవాణా ఆగిపోయిందని గ్రహించిన పోలీసులు క్రమేనా చెక్ పోస్ట్‌ను రమారమి మూసివేసారు. ఇది గ్రహించిన గంజాయి ముఠా ఇదే ప్రాంతం గుండా రవాణాకు అనువుగా ఉంటుందని ఎంచుకున్నట్లు తెలుస్తోంది.




పోలీసులకు పట్టుబడ్డ వాహనం

నేరాలు ఘోరాలు

నీటికుంటలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని కూర్మరాజు పేటకు చెందిన యువకుడు క్వారీ కుంటలో పడి మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. కూర్మరాజుపేటకు చెందిన బైరెడ్డి జ్ఞాన ప్రకాష్ శుక్రవారం తన పశువులను మేతకు గ్రామానికి పక్కన ఉన్న పామాయిల్ తోట ఎదురుగా గల పాత క్వారీ వద్ద తీసుకెళ్లాడు. ప్రకాష్ సాయంత్రం వరకు ఇంటికి చేరకపోవడంతో అతని తల్లిదండ్రులు, బంధువులు పరిసర ప్రాంతాల్లో గాలించినా కనిపించకపోవడంతో మళ్లీ శనివారం ఉదయం వెతకగ్గా అదే క్వారీ వద్ద గల కుంటలో శవమై పడి ఉన్నాడు. ఇది తెలుసుకున్న గ్రామపెద్దలు, బంధువులు స్థానిక రూరల్ పోలీసులకు సమారం ఇచ్చారు. ప్రకాష్ ఒంటి మీద చిన్న చిన్న గాట్లు ఉండడంతో ఇది ఎవరో హత్య చేసినట్లు వుందని దీనికి పోలీస్ వారు డాగ్ స్క్వాడ్ బృందాలను తెచ్చి వాస్తవాలు వెలికి తీయాలని, అంత వరకు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడ నుండి ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ఒప్పుకొనేది లేదని స్పష్టం చేశారు. మృతుని బంధువులు కోరినట్లు విచారణ చేస్తామని, పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ప్రభుత్వాసుపత్రికి రావచ్చని పోలీసులు తెలిపారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సాలూరు రూరల్ ఎస్ ఐ ప్రయోగ మూర్తి తెలిపారు.



మృతుడు జ్ఞాన ప్రకాష్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొండరూరల్

మండలంలో అట్టలి ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎ.గోవిందు తన కుమారుడితో కలిసి సరుబుజ్జిలి మండలం రొట్టవలస నుంచి వీరఘటం బైకు వెళ్తున్నాడు. పార్వతీపురం నుంచి వస్తున్న కారు అట్టలి వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈసంఘటనలో గోవిందు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.